సాక్షి రంగారెడ్డి

బుధవారం । 19 । ఏప్రిల్ । 2023



అమాయకులను ఏమార్చి..

ఏటీఎంలకు వెళ్లే అమాయకుల కార్డులు మార్చి డబ్బులు దోచుకుంటున్న వ్యక్తిని షాద్‌నగర్ పోలీసులు అరెస్టు చేశారు. 8లో▸




నేడు చేవెళ్లకు హోంమంత్రి

చేవెళ్లలో కొత్తగా నిర్మించిన పోలీస్‌స్టేషన్ భవనాన్ని బుధవారం హోంమంత్రి మహమూద్‌అలీ ప్రారంభించనున్నట్లు సీఐ తెలిపారు. 8లో▸

భక్తిశ్రద్ధలతో జగ్‌నేకీ రాత్

సాక్షి, సిటీబ్యూరో: లైలతుల్ ఖదర్ (షబ్బే ఖదర్)ను ముస్లింలు మంగళవారం రాత్రి భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఈ సందర్భంగా మసీదుల్లో ఇషా నమాజ్ ప్రార్థనలు చేశారు. రాత్రంతా జాగారం (జగ్‌నేకీ రాత్) చేశారు. మసీదులతో పాటు నగరంలోని వివిధ మైదానాల్లో బహిరంగ సభలు నిర్వహించి లైలతుల్ ఖదర్ విశిష్టతను మత గురువులు వివరించారు.



న్యూస్‌రీల్

ముగిసిన భాగవత సప్తాహం



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న హన్మంతరావు తదితరులు

హుడాకాంప్లెక్స్: ఆధ్యాత్మిక పుస్తకం హస్త భూషణం అని రాష్ట్ర పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్, హార్టీ, సెరీ కల్చర్ కమిషనర్ హన్మంతరావు అన్నారు. సరూర్‌నగర్ హుడా కాలనీలోని రామాలయంలో మంగళవారం దేవులపల్లి వరప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భాగవత సప్తాహం ఆధ్యాత్మిక ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఆధ్మాత్మిక ప్రవచనకర్త శ్రీమాన్ సముద్రాల శఠకోపాచార్య రచించిన ఆణిముత్యాలు, సుధాతరంగాలు పుస్తకాలను ఆవిష్కరించారు. భాగవత సప్తాహం ముగింపు కార్యక్రమంలో భాగంగా ప్రవచనకర్త శఠకోపాచార్యులు భాగవతంలోని గజేంద్ర మోక్షం, శ్రీకృష్ణ భగవానుని గురించి శ్లోకాలను పఠిస్తూ వాటి అర్థాలను విడమరిచి చెప్పారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ భక్తి శ్రద్ధలతో నిర్వహించిన రుక్మిణీ కల్యాణం నేత్రపర్వంగా జరిగింది. ఈ సందర్భంగా హన్మంతరావును వేదపండితులు ఆశీర్వదించగా ఆలయ పాలక మండలి సభ్యులు శాలువాలు, పూల బొకేలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నగర వైష్ణవ సేవాట్రస్ట్ కార్యదర్శి చిలుకమర్రి లక్ష్మీనాథాచార్యులు, భక్తులు మంత్రిప్రగడ ప్రమీల, విజయలక్ష్మి, సౌజన్య, అనురాధ జగన్‌మోహన్‌రావు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



కన్హాలో పరుచుకున్న పచ్చదనం



గ్రామస్తులు తిరిగేందుకు ఏర్పాటు చేసిన బ్యాటరీ వాహనాలు

కన్హా.. వహ్వా

పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా ముందుకు సాగారు.. కాలుష్య నివారణకు నడుం బిగించారు.. పరవశింపజేసే పచ్చదనాన్ని అడుగడుగునా పరిచారు.. నీటి సంరక్షణకు ఇంటింటికీ ఇంకుడు గుంతలు తవ్వుకున్నారు.. ప్రతి ఇంటిపై సోలార్ ప్యానల్ ఏర్పాటు చేసుకున్నారు.. పచ్చదనానికి కేరాఫ్ అడ్రస్‌గా మార్చేశారు.. రాష్ట్రంలోనే కాదు జాతీయ స్థాయిలో గ్రామానికి గుర్తింపు తెచ్చారు. ప్రగతి దిశగా అడుగులు వేసి అందరి దృష్టిని ఆకర్షించి ఇప్పటికే రాష్ట్రంలోనే ఉత్తమ పంచాయతీగా అవార్డు అందుకుంది నందిగామ మండల పరిధిలోని కన్హా గ్రామ పంచాయతీ. తాజాగా జాతీయస్థాయి పురస్కారాన్ని సైతం కైవసం చేసుకుంది.

షాద్‌నగర్: ప్రపంచంలోనే అత్యున్నత ఆధ్యాత్మిక ధ్యాన కేంద్రంగా పేరున్న శాంతి వనం కన్హా పంచాయతీ పరిధిలోనే ఉండడం విశేషం. ఏటా వివిధ కార్యక్రమాలను పురస్కరించుకొని దేశ, విదేశాల నుంచి ఇక్కడికి పెద్ద ఎత్తున అభ్యాసీలు వస్తుంటారు. చేగూరు పంచాయతీ నుంచి విడిపోయి 2016లో కన్హా పంచాయతీ ఏర్పడింది. 2011 జనాభా లెక్కల ప్రకారం గ్రామంలో 606 మంది జనాభా ఉండగా ప్రస్తుతం మూడు వేల మంది వరకు నివసిస్తున్నారు. అప్పట్లో 545 ఇళ్లు ఉండగా



వర్షపు నీరు నిలిచే కుంట



కేంద్రమంత్రి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న సర్పంచ్ సరిత

425 మంది ఓటర్లు ఉన్నారు. ప్రస్తుతం ఆ సంఖ్య గణనీయంగా పెరిగింది. పంచాయతీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలన్న ఆలోచనతో స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు కలిసి కట్టుగా ముందడుగు వేశారు. పర్యావరణ పరిరక్షణ, భూ సంరక్షణ, కాలుష్య నివారణ తదితర అంశాల్లో నూటికి నూరు శాతం ఫలితాలు సాధించారు. గత ఆర్థిక సంవత్సరం గ్రామంలో సుమారు రూ.14 లక్షల పన్నులు (వంద శాతం) వసూలు చేయడం గమనార్హం. దీంతో గ్రామాన్ని ప్రత్యేకంగా గుర్తించిన ప్రభుత్వం పురస్కారాలతో ప్రోత్సహించింది. ఈ క్రమంలో గత నెల 31న మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా 'కార్బన్ న్యూటలిటీ విశేష్ పంచాయతీ పురస్కార్', 'గ్రామ ఊర్జా స్వరాజ్ విశేష్ పంచాయతీ పురస్కార్'ను సర్పంచ్ సరిత అందుకున్నారు. తాజాగా సోమవారం ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి గిరిరాజ్‌సింగ్ చౌహాన్ చేతుల మీదుగా 'పర్యావరణం ప్రకృతి' విభాగంలో 'కార్బన్ న్యూటలిటీ విశేష్ పంచాయతీ పురస్కార్'ను అందుకున్నారు.

ఇదీ ముందడుగు

- పంచాయతీ పరిధిలో విరివిగా మొక్కలు నాటి పచ్చదనంతో పరవశించేలా పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్నారు.
- 7లక్షలకు పైగా మొక్కలు నాటారు. ఇందులో వివిధ దేశాలకు చెందిన ఔషధ మొక్కలతో పాటు రకరకాల పండ్లు, పూలు, సువాసనలు వెదజల్లే మొక్కలు ఉన్నాయి. దీంతో పంచాయతీ ప్రాంతం ఆహ్లాదకర వాతావరణంలో కనిపిస్తోంది.
- వర్షపు నీటిని సంరక్షించేందుకు గ్రామంలోని ప్రతీ ఇంటికి ఇంకుడు గుంతను నిర్మించడం తప్పనిసరి చేశారు.
- గ్రామంలోని ప్రతి ఇంటిపై సోలార్ ప్యానెల్ ఏర్పాటుతో పాటు ఎల్ఈడీ బల్బుల ద్వారా విద్యుత్ పొదుపు కార్యక్రమాన్ని చేపట్టారు.
- ఇళ్లలో కాలుష్యం, ఆరోగ్య సమస్యల నివారణలో భాగంగా కట్టెల పొయ్యి వాడకాన్ని పూర్తిగా నిషేధించారు.
- కాలుష్య రహిత పంచాయతీగా తీర్చిదిద్దేందుకు బ్యాటరీ వాహనాలు, సైకిళ్లు వినియోగిస్తున్నారు.

ఆదర్శంగా నిలిచిన పంచాయతీ

- గ్రామంలో ఎటు చూసినా పచ్చదనమే..
- ఇంటింటికీ ఇంకుడు గుంతలు
- ప్రతి ఇంటిపై సోలార్ ప్యానల్
- చేయిచేయి కలిపి అభివృద్ధికి అడుగులు
- రాష్ట్ర, జాతీయ స్థాయిలో అవార్డులు

- అత్యధికంగా సౌర విద్యుత్ ఉపయోగించుకోవడమే కాకుండా నీటి సంరక్షణ, మట్టి సంరక్షణ, పర్యావరణ సంరక్షణ వంటివి చేపడుతున్నారు.

వర్షపు నీరు వృథా కాకుండా..

కన్హా శాంతి వనంలో కురిసిన ప్రతి వర్షపు చుక్క వృథా కాకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. వరద నీరు వెళ్లేందుకు ప్రత్యేకంగా కాలువలను ఏర్పాటు చేసి నీటి కుంటలకు నీటిని మళ్లిస్తున్నారు. ఆ నీరు ఒకేచోట చేరేలా చర్యలు తీసుకొని వాటిని అక్కడి మొక్కలు, చెట్లకు వినియోగిస్తున్నారు.

సందర్శించిన ప్రముఖులెందరో..

కన్హా శాంతి వనాన్ని ఇప్పటికే ఎంతో మంది ప్రముఖులు సందర్శించారు. అప్పట్లో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, కేంద్ర మంత్రులు, దేశ విదేశాలకు చెందిన ప్రముఖులు, ఆధ్యాత్మిక, క్రీడలకు సంబంధించిన వారితో పాటు ఐటీ రంగ నిపుణులు కన్హా శాంతి వనాన్ని సందర్శించి మొక్కలు నాటారు.

చేయాల్సింది ఇంకా ఉంది



శ్రీ రామ చంద్ర మిషన్‌తో పాటు రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి చేసుకున్నాం. దీనికి గురూజీ దాజీ సహకారం ఎంతగానో ఉంది. రాష్ట్ర స్థాయిలో ఇప్పటికే అవార్డు అందుకున్నాం. ప్రస్తుతం జాతీయ స్థాయిలోనూ పురస్కారం అందుకోవడం సంతోషంగా ఉంది. గ్రామాన్ని మరింతగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తాం.

– సరిత, సర్పంచ్, కన్హా శాంతి వనం

ఈ ప్రభుత్వాన్ని తప్పిస్తేనే అభివృద్ధి

- డబుల్ ఇంజిన్ సర్కార్‌కు ఒక్కసారి అవకాశం ఇవ్వండి
- 23న అమిత్‌షా సభను విజయవంతం చేయండి
- బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి



చేవెళ్లలో నిర్వహించే అమిత్‌షా బహిరంగ సభా స్థలిని పరిశీలిస్తున్న బీజేపీ నేతలు

చేవెళ్ల: రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వాన్ని పక్కకు తప్పిస్తేనే అభివృద్ధి సాధ్యమని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి అన్నారు. ఈ నెల 23న చేవెళ్లలో కేంద్ర మంత్రి అమిత్‌షా పర్యటన నేపథ్యంలో కేవీఆర్ గ్రౌండ్‌లో నిర్వహించే బహిరంగ సభా స్థలాన్ని మంగళవారం మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మాజీ మంత్రి ఎ.చంద్రశేఖర్, రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల అధ్యక్షులు బొక్క నర్సింహారెడ్డి, సదానందరెడ్డితో కలిసి పరిశీలించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్రం ఎంత అభివృద్ధి చేసినా, ఎన్ని సంక్షేమ పథకాలు తెస్తున్నా కేసీఆర్ ప్రభుత్వం వాటిని ప్రజలకు చేరకుండా అన్యాయం చేస్తోందని విమర్శించారు. ఎక్కడ కేంద్రానికి పేరు వస్తుందోనని ఎన్నో పథకాలను ప్రజలకు అందకుండా, తెలియకుండా చేస్తోందని దుయ్యబట్టారు. కేంద్రం పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రవాస్ యోజన పేరుతో కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఇందులో భాగంగానే చేవెళ్లలో బహిరంగ సభకు నిర్ణయించినట్లు చెప్పారు. మధ్యాహ్నం 3.30 గంటలకు బహిరంగ సభ ఉంటుందని, అనంతరం చేవెళ్ల పార్లమెంట్ పరిధిలోని ముఖ్య నాయకులతో అమిత్‌షా ప్రత్యేకంగా సమావేశమవుతారని ఆయన వెల్లడించారు. సభను విజయవంతం చేసేందుకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మాజీ మంత్రి ఎ.చంద్రశేఖర్ మాట్లాడుతూ అమిత్‌షా సభతో చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో భారీ మార్పులు జరుగుతాయని.. పార్టీలో కొత్త ఉత్సాహం వస్తుంద న్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మల్లారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, అంజన్‌కుమార్, కె.ప్రకాశ్, రాములు, అత్తెల్లి అనంత్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, పాండుగౌడ్ పాల్గొన్నారు.

ప్రత్యర్థులకు సహకరిస్తున్నాడనే..

- డాక్యుమెంట్ రైటర్ హత్య కేసులో వీడిన మిస్టరీ
- కొత్తూరు ఎంపీపీతో సహా ముగ్గురి రిమాండ్
- వివరాలు వెల్లడించిన శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి



నిందితులు



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ నారాయణరెడ్డి

శంషాబాద్: వ్యాపారంలో తన మాట వినకపోవడంతో పాటు ప్రత్యర్థులకు సహకరిస్తున్నాడన్న కారణంతోనే డాక్యుమెంట్ రైటర్‌ను హత్య చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు. కిడ్నాప్, హత్య కేసులో ప్రధాన నిందితుడు కొత్తూరు ఎంపీపీ మధుసూదన్‌రెడ్డితో పాటు మరో ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి మంగళవారం కేసు వివరాలు వెల్లడించారు. కొత్తూరు మండలం, మల్లాపూర్ గ్రామానికి చెందిన కరుణాకర్‌రెడ్డి (29)కి తహసీల్దార్ కార్యాలయం వద్ద డాక్యుమెంట్ రైటర్‌గా షాపు ఏర్పాటు చేసుకునేందుకు ఎంపీపీ సహకరించాడు. ఆ తర్వాత కొంతకాలానికి తన బంధువుకు అందులో భాగస్వామ్యం కల్పించాలని కోరగా కరుణాకర్‌రెడ్డి అందుకు నిరాకరించాడు. ఇటీవల మల్లాపూర్‌లోని ఓ భూ వివాదంలో ఎంపీపీకి ప్రత్యర్థిగా ఉన్న వ్యక్తితో కలిసి ఫెన్సింగ్‌ను తొలగించేందుకు కరుణాకర్‌రెడ్డి సహకరించాడు. దీంతో అతడిపై కక్ష పెంచుకున్న మధుసూదన్ రెడ్డి హత్య చేయాలని నిర్ణయించుకున్నాడు.

కిడ్నాప్ చేసి..

ఈ నెల 16న సాయంత్రం 5.30 గంటలకు కరుణాకర్‌రెడ్డి అదే గ్రామానికి చెందిన శ్రీధర్‌రెడ్డి అతడి మామ రాంచంద్రారెడ్డిని మామిడిపల్లి గ్రామంలో దింపి మల్లాపూర్‌కు తిరుగు పయనమయ్యారు. మార్గమధ్యలో తీగాపూర్ వద్ద ఎంపీపీ మధుసూదన్ రెడ్డితో పాటు పిన్నింటి విక్రమ్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, మహ్మద్ ఆరిఫ్ పాషా, అరుణ్ కుమార్‌రెడ్డి స్కార్పియో వాహనంతో అటకాయించారు. కారు అద్దాలు పగులగొట్టి కరుణాకర్‌రెడ్డిని స్కార్పియో వాహనంలోకి ఎక్కించుకుని చేవెళ్ల రోడ్డువైపు వెళ్లారు. మొయినాబాద్ సమీపంలో నిర్మానుష్య ప్రదేశంలో కర్రలతో విచక్షణారహితంగా కరుణాకర్‌రెడ్డిపై దాడి చేశారు.

ఆస్పత్రికి తీసుకెళ్లి..

పూర్తిగా స్పృహ కోల్పోయిన కరుణాకర్‌రెడ్డిని విక్రమ్‌రెడ్డి, ఆరిఫ్, అరుణ్‌కుమార్ గచ్చిబౌలిలోని కాంటినెంటల్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. రోడ్డు ప్రమాదంలో గాయపడినట్లు చెప్పి ఆస్పత్రిలో చేర్చారు. పరీక్షించిన వైద్యులు అతడు మృతిచెందినట్లు ధ్రువీకరించేలోపే నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు. ఆస్పత్రి వైద్యులు విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లడంతో అప్పటికే శ్రీధర్‌రెడ్డి ద్వారా కిడ్నాప్ ఫిర్యాదు అందుకున్న కొత్తూరు పోలీసులు కాంటినెంటల్‌లో ఉన్న మృతదేహం కరుణాకర్‌రెడ్డిదిగా గుర్తించి కేసు దర్యాప్తు వేగవంతం చేశారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం విశ్వసనీయ సమాచారం మేరకు రాజేంద్రనగర్ సన్‌సిటీ ఏరియాలో ఉన్న ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి, విక్రమ్ రెడ్డి, మహ్మద్ ఆరిఫ్, అరుణ్‌కుమార్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. నిందితుల్లో ఒకరైన విష్ణువర్ధన్‌రెడ్డి పరారీలో ఉన్నాడు.

పోస్టుమార్టం పూర్తి

అఫ్జల్‌గంజ్: హత్యకు గురైన డాక్యుమెంట్ రైటర్ కరుణాకర్ రెడ్డి మృతదేహానికి మంగళవారం ఉస్మానియా మార్చురీలో పోస్టుమార్టం పూర్తి చేశారు. అనంతరం మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ మార్చురీ వద్దకు చేరుకొని కరుణాకర్ రెడ్డి మృతదేహాన్ని పరిశీలించారు. సమగ్ర విచారణ జరిపించి బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తానని మృతుడి కుటుంబీకులకు హామీ ఇచ్చారు.

దేశం మొత్తం చూసేలా అభివృద్ధి

ఆదర్శంగా హైదరాబాద్ మహా నగరం: మంత్రి సబితా రెడ్డి

పహాడీషరీఫ్: దేశం మొత్తం హైదరాబాద్ మహా నగరం వైపు చూసేలా ముఖ్యమంత్రి కేసీఆర్ అభివృద్ధి పనులు కొనసాగిస్తున్నారని విద్యాశాఖ మంత్రి పి.సబితారెడ్డి అన్నారు. రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం ఉత్తర ద్వారం నుంచి మామిడిపల్లి కూడలి వరకు రూ.29.50 కోట్ల వ్యయంతో నిర్మించనున్న నాలుగు వరుసల రహదారి విస్తరణ పనులకు మంగళవారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ చొరవతో హైదరాబాద్ నగర శివారులో అవసరమైన మేరకు ఫ్లై ఓవర్లు, అండర్ పాస్‌లు నిర్మించి ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా వాహనదారులకు వెసులుబాటు కల్పిస్తున్నారన్నారు. మౌలిక సదుపాయాల కల్పనతోనే పెట్టుబడులు పెద్ద ఎత్తున వస్తున్నాయన్నారు. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు మెట్రో రైలు మార్గం కొనసాగించనున్నట్లు చెప్పారు. ఈ క్రమంలోనే విమానాశ్రయానికి వెళ్లేందుకు కేటీఆర్ చొరవతో ఈ మార్గం విస్తరణ పనులు ప్రారంభమవుతున్నాయన్నారు. తుక్కుగూడలో 52 కంపెనీలు, వాక్స్‌కాన్ కంపెనీ, కందుకూర్‌లో ఫార్మాసిటీతో లక్షలాది మందికి ఉద్యోగ అవకాశాలు దక్కనున్నట్లు ఆమె తెలిపారు. అభివృద్ధి విజన్‌తో పనిచేస్తున్న కార్యక్రమంలో బడంగ్‌పేట్ మేయర్ చిగురింత పారిజాత, 11,12 డివిజన్ల కార్పొరేటర్లు చుక్క శివకుమార్, యాతం పవన్ కుమార్ యాదవ్, పార్టీ నాయకులు నిమ్మల నరేందర్ గౌడ్, రామిడి రాంరెడ్డి, ఆనంద్ రెడ్డి, శేఖర్ రెడ్డి, రమేష్, వెంకట్‌రెడ్డి, యాతం బాల్ రాజ్ యాదవ్, కోట్ల వెంకటేష్, చంద్రయ్య, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేయాలి

షాద్‌నగర్‌రూరల్: మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యుల ఆర్థిక, సామాజిక స్థితిగతులను బేరీజు వేసేందుకు సభ్యుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సిబ్బందికి డీఆర్‌డీఓ పీడీ ప్రభాకర్ సూచించారు. మంగళవారం పట్టణంలోని మండల మహిళా సమాఖ్య భవనంలో నియోజకవర్గంలో పని చేస్తున్న సెర్ప్, ఏపీఎం, సీసీలు, మండల సమాఖ్య అకౌంటెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లకు సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ విధి నిర్వహణలో ఎవరు నిర్లక్ష్యం వహించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో అదనపు పీడీ జంగారెడ్డి, డీపీఎం స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.



మెరుగైన జీవ వైవిధ్యం

- సిటీ బయో డైవర్సిటీ ఇండెక్స్‌లో పైపైకి ..
- 36 నుంచి 57 పాయింట్లకు చేరిన స్కోర్
- పదేళ్లలో నగరంలో గణనీయమైన వృద్ధి
- ఇండెక్స్‌ను విడుదల చేసిన మంత్రి కేటీఆర్

సాక్షి, సిటీబ్యూరో: నగర జీవవైవిధ్య సూచి (సిటీ బయో డైవర్సిటీ ఇండెక్స్)లో హైదరాబాద్ నగరం గణనీయమైన వృద్ధి సాధించింది. 2012లో ఇండెక్స్‌లో 36 పాయింట్ల స్కోర్‌తో ఉన్న నగరం తాజా ఇండెక్స్‌లో 57 పాయింట్ల స్కోర్ సాధించింది. ఇక్లీ (ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఫర్ లోకల్ ఎన్విరాన్‌మెంటల్ ఇనిషియేటివ్స్) ద్వారా జీహెచ్ఎంసీ రూపొందించిన తాజా సిటీ బయోడైవర్సిటీ ఇండెక్స్‌ను మంగళవారం మంత్రి కేటీఆర్ ఆవిష్కరించారు. ఈ ఇండెక్స్‌లో నగరం పలు అంశాల్లో ఎంతో అభివృద్ధి సాధించినట్లు వెల్లడైంది. హైదరాబాద్‌లో ప్రస్తుతం దాదాపు రెండు వేల హెక్టార్లలో విస్తరించి ఉన్న 1350కి పైగా జల వనరులు, 1600 హెక్టార్లలో విస్తరించిన సహజ రాళ్లగుట్టలు, నగరంలో ఉన్న రెండు జాతీయ పార్కులు (కేబీఆర్, హరిణి వనస్థలి) జీవవైవిధ్యానికి దోహదం చేస్తున్నాయని నివేదికలో పేర్కొన్నారు. దీంతోపాటు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ, ఉస్మానియా యూనివర్సిటీ, ఇక్రిశాట్ వంటి సంస్థలకు ఉన్న సువిశాలమైన క్యాంపస్‌లు జీవవైవిధ్యానికి కేంద్రాలుగా ఉన్నాయని తేలింది.

ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలతోనే..

నగరం కోసం ప్రత్యేకంగా బయో డైవర్సిటీ ఇండెక్స్ తయారు చేయించిన అధికారులను మంత్రి కేటీఆర్ అభినందించారు. ఒక నిజమైన ప్రపంచ స్థాయి నగరంగా మారే పరిణామ క్రమంలో జీవవైవిధ్యం అత్యంత కీలకమైన అంశమని కేటీఆర్ ఈ సందర్భంగా అన్నారు. జీవించు– జీవించనివ్వు అన్న స్ఫూర్తి ఆధారంగా నగరీకరణ జరిగినప్పుడే ప్రకృతితో మమేకమై బతకగలిగే పరిస్థితి ఉంటుందన్నారు. ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన హరిత హారం, చెరువుల సంరక్షణ – బలోపేతం, అడవుల పెంపకం, అర్బన్ లంగ్ స్పేసెస్ వంటి కార్యక్రమాలు నగర జీవవైవిధ్యానికి ఎంతగానో ఉపయోగపడుతున్నాయని, భవిష్యత్తులోనూ నగరంతోపాటు, నగరం చుట్టుపక్కల కూడా జీవవైవిధ్యం మరింత పెరుగుతుందని కేటీఆర్ విశ్వాసం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, మున్సిపల్‌శాఖ స్పెషల్ చీఫ్‌సెక్రటరీ అర్వింద్‌కుమార్, జీహెచ్ఎంసీ కమిషనర్ లోకేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాసరావు వ్యాఖ్యలు అవివేకం

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్ గౌడ్



అబ్దుల్లాపూర్‌మెట్: రాష్ట్ర ఆరోగ్య శాఖ డైరెక్టర్‌గా ఉన్న శ్రీనివాసరావు కొత్తగూడెంలో చేసిన వ్యాఖ్యలు వైద్య ఆరోగ్య వ్యవస్థకే తలవంపు తెచ్చేదిగా ఉందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం వెంకటేశంగౌడ్ అన్నారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. తాను తాయత్తు మహిమ వల్లే బతికానని శ్రీనివాసరావు అనడం ప్రజల్లో మూఢనమ్మకాలను ప్రేరేపించడమే అన్నారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారి అయి ఉండి ప్రజలను ఆరోగ్య పరంగా అప్రమత్తం చేయాల్సింది పోయి తాయత్తు మహిమలు అంటూ మూఢనమ్మకాలను ప్రేరేపించడం సరికాదని మండిపడ్డారు. ఇకపై ఇలాంటి వ్యాఖ్యలు చేయకుండా ఆ శాఖ మంత్రి చొరవ తీసుకోవాలని ఆయన సూచించారు.

అమాయకులను ఏమార్చి..



నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న సీఐ నవీన్‌కుమార్

ఏటీఎం కార్డు తస్కరించి..
- నగదు దోచుకుంటున్న వ్యక్తి అరెస్ట్
- వివరాలు వెల్లడించిన సీఐ నవీన్‌కుమార్

షాద్‌నగర్ రూరల్: డబ్బులు డ్రా చేసుకునేందుకు ఏటీఎంలకు వెళ్లే అమాయకుల కార్డులు మార్చి డబ్బులు దోచుకుంటున్న వ్యక్తిని షాద్‌నగర్ పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం పట్టణ సీఐ నవీన్‌కుమార్ ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఫరూఖ్‌నగర్ మండలం కడియాల కుంట గ్రామ పంచాయతీ బూరుగడ్డ తండాకు చెందిన ముడావత్ భోజ్యానాయక్ మార్చి 2వ తేదీ మధ్యాహ్నం షాద్‌నగర్‌లోని రైల్వేస్టేషన్ రోడ్డులో గల ఎస్‌బీఐ ఏటీఎంలో డబ్బులు డ్రా చేసుకునేందుకు వచ్చాడు. అయితే భోజ్యానాయక్‌కు ఏటీఎం నుంచి డబ్బులు తీసేందుకు రాకపోవడంతో అక్కడే ఉన్న హైదరాబాద్ టోలీచౌకి ప్రాంతానికి చెందిన మహ్మద్ యూసుఫ్ హుస్సేన్ సాయం కోరాడు. ఇదే అదనుగా భావించిన మహ్మద్ యూసుఫ్ భోజ్యానాయక్ ఏటీఎం పిన్ నంబర్ తెలుసుకున్నాడు. భోజ్యా నాయక్‌కు నకిలీ ఏటీఎం కార్డు ఇచ్చి అక్కడి నుంచి ఉడాయించాడు. అనంతరం మరో ఏటీఎంలో భోజ్యానాయక్ కార్డు ఉపయోగించి మహ్మద్ యూసుఫ్ రూ. 50వేలు డ్రా చేసుకున్నాడు. ఈ విషయమై బాధితుడు భోజ్యానాయక్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన షాద్‌నగర్ పోలీసులు నిందితున్ని అదుపులోకి తీసున్నారు. విచారణలో మహ్మద్ యూసుఫ్ భద్రాచలం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి నుంచి ఏటీఎం కార్డు కాజేసి రూ. 3లక్షలు డ్రా చేసుకున్నట్లు తెలిపాడు. నిందితుడి నుంచి ఈ రెండు కేసులకు సంబంధించి రూ. 2.90లక్షలు రికవరీ చేశారు. అలాగే స్కూటీని స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. నిందితుడు ఇప్పటి వరకు 20 కేసుల్లో అరెస్టు అయి జైలుకు వెళ్లి వచ్చినట్లు పోలీసులు తెలిపారు. కేసును ఛేదించిన డీఐ భరత్‌కుమార్, సీహెచ్ దేవకీ, క్రైమ్ సిబ్బంది జాకీర్, రవి, యాదగిరి, మోహన్, రాజు, రఫీని సీఐ నవీన్‌కుమార్ అభినందించారు.



మంత్రి కేటీఆర్‌తో ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ తదితరులు

కేటీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే అంజయ్య

షాద్‌నగర్: మంత్రి కేటీఆర్‌ను హైదరాబాద్‌లోని హెచ్ఎండీఓ కార్యాలయంలో మంగళవారం షాద్‌నగర్ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కొత్తూరు, షాద్‌నగర్ మున్సిపాలిటీల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని మంత్రిని కోరారు. ఇందుకు కేటీఆర్ సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో జెడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేష్, నాయకులు దేవేందర్ యాదవ్, పీ యాదగిరి తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం

- ఆగిఉన్న లారీని ఢీకొన్న బైక్
- చేవెళ్ల మండలంలో ఘటన



ప్రమాద స్థలంలో మృతదేహాలు

చేవెళ్ల: రోడ్డుపై ఆగిఉన్న లారీని వెనుక నుంచి బైక్ ఢీ కొనడంతో బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని ఖానాపూర్‌కు చెందిన కే విజయ్‌రాజు(45) పగలు మెడికల్ దుకాణంలో, రాత్రి చేవెళ్లలోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో నైట్ వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. హన్మకొండ జిల్లా పరకాలకు చెందిన ధనుంజయ్‌రెడ్డి(42) 15ఏళ్లుగా చేవెళ్లలోని ప్రైవేట్ కంపెనీలో మెడికల్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్నాడు. ఇద్దరికీ పరిచయం ఉండడంతో సోమవారం రాత్రి వారు బైక్‌పై షాబాద్ మండలం లక్ష్మారావుగూడలో తెలిసిన వ్యక్తి ఇంట్లో దావత్‌కు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో బైక్‌పై చేవెళ్లకు వస్తున్నారు. చేవెళ్ల మండలం పామెన బస్ స్టేజి వద్ద ఓ లారీ ఎలాంటి ఇండికేటర్లు లేకుండా రోడ్డుపై ఆగి ఉంది. బైక్ వేగంగా వచ్చి లారీ వెనుక భాగంలో ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న విజయ్ రాజు, ధనుంజయ్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందారు. గమనించిన ప్రయాణికులు పోలీసులు, 108కు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మూడోసారీ మాదే అధికారం



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

ఆమనగల్లు: రాష్ట్రంలో ముచ్చటగా మూడోసారీ బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. మండల కేంద్రమైన మాడ్గుల రైతు వేదిక భవనంలో మంగళవారం వివిధ గ్రామాలకు చెందిన 94 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ మాట్లాడుతూ.. పేదల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శమన్నారు. సీఎం కేసీఆర్ అనేక వినూత్న పథకాలకు రూపకల్పన చేసి అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని ఆరోపించారు. వారి మాటలను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ దేవ్జానాయక్, డీటీ రాజశేఖర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ శంకర్‌నాయక్, మాడ్గుల సర్పంచ్ ఏ జంగయ్యగౌడ్, ఎంపీటీసీల సంఘం మండల అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, జిల్లా రైతు సమన్వయ సమితి సభ్యుడు కృష్ణారెడ్డి, సర్పంచులు రమేశ్‌రెడ్డి, యాదిరెడ్డి, పార్వతమ్మ, హనుమాన్ నాయక్, పుష్పలత, పద్మ, ఎంపీటీసీలు వెంకటయ్య, తిరుపతమ్మ, సరిత, నాయకులు జంగయ్యయాదవ్, యాదయ్య, భూపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం

- ఎమ్మెల్యే కాలె యాదయ్య



ముస్లింలకు రంజాన్ కానుకలు అందజేస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

మొయినాబాద్ రూరల్: గ్రామాల అభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యమని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మంగళవారం మొయినాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో రంజాన్‌ను పురస్కరించుకొని ముస్లింలకు ప్రభుత్వం తరఫున కానుకలు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు చేపడుతున్నట్లు తెలిపారు. అభివృద్ధిని చూసి ఓర్వలేని కాంగ్రెస్, బీజేపీలు లేనిపోని ఆరోపణలు చేస్తున్నాయని మండిపడ్డారు. కార్యక్రమంలో తహసీల్దార్ అశోక్‌కుమార్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, ఎంపీపీ నక్షత్రం, జెడ్పీటీసీ కే శ్రీకాంత్ పాల్గొన్నారు.

నేడు చేవెళ్లకు హోంమంత్రి రాక



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న చేవెళ్ల పోలీస్‌స్టేషన్

చేవెళ్ల: పట్టణంలో నూతనంగా నిర్మించిన పోలీస్‌స్టేషన్ భవనాన్ని బుధవారం రాష్ట్ర హోం శాఖ మంత్రి మహమూద్‌అలీ ప్రారంభించనున్నట్లు చేవెళ్ల సీఐ జే వెంకటేశ్వర్లు తెలిపారు. పోలీస్‌స్టేషన్ ఆవరణలో దాదాపు కోటి రూపాయలు వెచ్చించి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ కోసం భవనాన్ని నిర్మించారు. ఉదయం 9గంటలకు జరగనున్న భవన ప్రారంభోత్సవ కార్యక్రమంలో హోం మంత్రి తోపాటు జిల్లా మంత్రి సబితారెడ్డి,చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి,ఎమ్మెల్సీలు మహేందర్‌రెడ్డి,సురభివాణిదేవి,ఎమ్మెల్యే కాలె యాదయ్య, డీజీపీ అంజన్‌కుమార్, సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర హాజరు కానున్నట్లు సీఐ తెలిపారు.

ఆలయాలు ప్రశాంతతకు నిలయాలు

- అఖిల భారత యాదవ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవి యాదవ్



పూజలో పాల్గొన్న రవి యాదవ్, అనిత తదితరులు

మొయినాబాద్ రూరల్: ఆలయాలు ప్రశాంతతకు నిలయాలని అఖిల భారత యాదవ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎం రవి యాదవ్, రైతు సంఘం మండల సమన్వయ సమితి అధ్యక్షుడు శ్రీహరి యాదవ్ అన్నారు. మంగళవారం మండలంలోని హిమాయత్‌నగర్‌లో మాజీ ఎంపీపీ అనిత ఆధ్వర్యంలో సాయిబాబా ఆలయ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు సాయిబాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. సాయిబాబా ఆశీస్సులు అందరికి ఉంటాయన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, వైఎస్ఆర్ టీపీ జిల్లా నాయకులు రాజయ్య, నాయకులు ముకుందరావు తదితరులు పాల్గొన్నారు.

చెరువులో మృతదేహం లభ్యం



కృష్ణ (ఫైల్)

పసుమాములకు చెందిన కృష్ణగా గుర్తింపు

ఇబ్రహీంపట్నం: స్థానిక పెద్ద చెరువులో మంగళవారం వ్యక్తి మృతదేహం బయటపడింది. ఎస్ఐ శేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. నల్గొండ జిల్లా గట్టుప్పల్‌కు చెందిన కే కృష్ణ(37) హయత్‌నగర్ మండలం పసుమాములలో నివాసం ఉంటున్నాడు. ప్రైవేట్ ల్యాండ్ సర్వేయర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 12న ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇబ్రహీంపట్నం చెరువు కట్ట వద్ద కృష్ణ సెల్ ఫోన్ సిగ్నల్ నిలిచిపోయినట్లు పోలీసులు గుర్తించారు. ఆ మేరకు దర్యాప్తు చేపట్టారు. చెరువులో వ్యక్తి మృతదేహం కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మున్సిపల్ సిబ్బంది సహకారంతో మృతదేహాన్ని బయటకు తీశారు. ఆనవాళ్ల ఆధారంగా మృతుడు కృష్ణగా గుర్తించారు. బెట్టింగ్ అలవాటు ఉన్న కృష్ణకు అప్పులు అధికం కావడంతో ఆత్మహత్య చేసుకొని ఉండవచ్చని ఎస్ఐ తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న డోజర్

దంపతులకు గాయాలు



ప్రమాద స్థలంలో దంపతులు

కేశంపేట: బైక్‌ను డోజర్ ఢీ కొనడంతో దంపతులకు గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలో చోటుచేసుకుంది. పాపిరెడ్డిగూడకు చెందిన కే జంగయ్య, లక్ష్మమ్మ దంపతులు. వీరు కాకునూర్‌లోని కూతుర్ని చూసి మంగళవారం సొంత గ్రామానికి బైక్‌పై బయలుదేరారు. కొండారెడ్డిపల్లి వద్దకు రాగానే ఎదురుగా వచ్చిన డోజర్ వీరి బైక్‌ను ఢీకొంది. దీంతో ఇద్దరికీ గాయాలయ్యాయి. క్షతగాత్రులను షాద్‌నగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

సర్పంచుల సంఘం రాష్ట్ర కార్యదర్శిగా జనార్దన్‌రెడ్డి



జనార్దన్‌రెడ్డికి నియామకపత్రం అందజేస్తున్న భూమన్న యాదవ్

మొయినాబాద్ రూరల్: సర్పంచుల సంఘం రాష్ట్ర కార్యదర్శిగా కనకమామిడి సర్పంచ్ పీ జనార్దన్‌రెడ్డి నియమితులయ్యారు. మంగళవారం మండలంలోని హిమాయత్‌నగర్ గ్రామంలో సర్పంచులు, ప్రజాప్రతినిధుల సమావేశంలో సర్పంచుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు సీ భూమన్న యాదవ్ జనార్దన్‌రెడ్డికి నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా భూమన్న మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో సర్పంచులు, నాయకులు రవియాదవ్, గిరి తదితరులు పాల్గొన్నారు.

బెట్టింగ్ ముఠాల ఆటకట్టు



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి

- నలుగురు నిందితుల అరెస్ట్
- రూ.59.50 లక్షల నగదు స్వాధీనం



పోలీసుల అదుపులో నిందితులు

రాజేంద్రనగర్: ఫామ్‌హౌస్, లాడ్జీలో క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న నలుగురు వ్యక్తులను రాజేంద్రనగర్ ఎస్ఓటీ, మైలార్‌దేవ్‌పల్లి, మొయినాబాద్ పోలీసులు సంయుక్తంగా దాడి చేసి అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.59.50 లక్షల నగదు, ఏడు సెల్ ఫోన్లు, ఒక ట్యాబ్, క్రికెట్ స్కోర్ వేసేందుకు వినియోగించే పేపర్లను స్వాధీనం చేసుకున్నారు. మొయినాబాద్ ఫామ్‌హౌస్ కేసులో ప్రధాన నిందితుడితో పాటు మరో ఆరుగురు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మంగళవారం రాజేంద్రనగర్ డీసీపీ కార్యాలయంలో డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి, అడిషనల్ డీసీపీ సాధన రేష్మీ, రాజేంద్రనగర్ ఏసీపీ గంగాధర్‌తో కలిసి వివరాలు వెల్లడించారు. మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సురంగల్ గ్రామంలో కొత్తగా నిర్మించిన ఫామ్‌హౌస్‌ను కుకట్‌పల్లి ప్రాంతానికి చెందిన శంకర్ లీజుకు తీసుకున్నాడు. సోమవారం చెన్నయ్ సూపర్‌కింగ్స్, ఆర్‌సీబీల మధ్య జరుగుతున్న ఐపీఎల్ టి–20 మ్యాచ్‌కు సంబంధించి కుకట్‌పల్లి సుమిత్రానగర్‌కు చెందిన తిరుపతయ్య, ఓల్డ్ అల్వాల్‌కు చెందిన పి.నాగరాజు, మల్లారెడ్డితో కలిసి బెట్టింగ్ నిర్వహిస్తున్నాడు. దీనిపై సమాచారం అందడంతో రాజేంద్రనగర్ ఎస్ఓటీ, మొయినాబాద్ పోలీసులు దాడులు నిర్వహించారు. తిరుపతయ్య, నాగరాజు, మల్లారెడ్డిని అదుపులోకి తీసుకోగా, ప్రధాన నిందితుడు శంకర్, భాస్కర్, సిద్ధు, మల్లి, సాయిరెడ్డి, భాషా పరారయ్యారు. వారి నుంచి ట్యాబ్, ఆరు సెల్‌ఫోన్లు, రూ.40 లక్షల నగదు, రూ.12 లక్షల బ్యాంక్ ఖాతాలను స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణ నిమిత్తం నిందితులను మొయినాబాద్ పోలీసులకు అప్పగించారు.

లాడ్జిలో బెట్టింగ్ నిర్వహిస్తూ..

మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని దుర్గానగర్ అమన్ లాడ్జీలో కూకట్‌పల్లి ప్రాంతానికి చెందిన బలుసు సతీష్ సోమవారం ఉదయం గదిని అద్దెకు తీసుకున్నాడు. చెన్నై, ఆర్‌సీబీల మధ్య క్రికెట్ మ్యాచ్‌కు సంబంధించి ఆన్‌లైన్‌లో తన సెల్‌ఫోన్ ద్వారా బెట్టింగ్ నిర్వహిస్తున్నాడు. దీనిపై సమాచారం అందడంతో మైలార్‌దేవ్‌పల్లి, రాజేంద్రనగర్ ఎస్ఓటీ పోలీసులు లాడ్జీపై దాడి చేసి సతీష్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి రూ. 6.40 లక్షల నగదు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ప్రగతి నగర్‌కు చెందిన మరో నిందితుడు రవితేజ పరారీలో ఉన్నట్లు డీసీపీ వెల్లడించారు. ఈ రెండు కేసుల్లో ప్రతిభ చూపిన మొయినాబాద్, మైలార్‌దేవ్‌పల్లి పోలీసులతో పాటు ఎస్ఓటీ పోలీసులను అభినందిస్తూ నగదు బహుమతులను అందజేశారు.

బెట్టింగ్‌పై సమాచారం అందించండి

ప్రస్తుతం ఐపీఎల్ టి–20 క్రికెట్ పోటీల నేపథ్యంలో ఎవరైనా బెట్టింగ్‌లకు పాల్పడుతున్నట్లు గుర్తిస్తే పోలీసులకు సమాచారం అందించాలని డీసీపీ సూచించారు. బెట్టింగ్‌లో సర్వస్వం కోల్పోయి ఎందరో రోడ్డున పడ్డారన్నారు. బెట్టింగ్‌లపై స్థానిక పోలీసులకు ఎప్పటికప్పుడు అందించాలన్నారు.

పీడీ యాక్ట్ నమోదుకు చర్యలు

మైలార్‌దేవ్‌పల్లి, మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో పట్టుబడ్డ నిందితుల వివరాలను సేకరిస్తున్నట్లు డీసీపీ తెలిపారు. గతంలో వీరు బెట్టింగ్‌లకు పాల్పడినట్లు గుర్తిస్తే పీడీ యాక్టు నమోదుకు సిఫార్సు చేస్తామన్నారు.